ప్రజాశక్తి
బుధవారం 3 జులై 2024
అనంతపురం

సత్యసాయి కలెక్టర్‌గా టిఎస్.చేతన్

పల్నాడుకు అరుణ్‌బాబు బదిలీ

నూతన కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లా కలెక్టర్ వి.అరుణ్ బాబు పల్నాడు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అరుణ్ బాబు స్థానంలో సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్‌గా టిఎస్.చేతన్ నియమితులయ్యారు. ఆయన ఏపీ బేవరీస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తూ ప్రస్తుతం సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా రానున్నారు. టిఎస్.చేతన్ గతంలో సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కొంతకాలం పనిచేశారు.

8 కళాశాలలకు బ్రేక్

- నిబంధనలు లేకపోవడంతో నిరాకరణ
- 58 ఇంజినీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లకు అనుమతి
- జెఎన్‌టియుఎ పాలక మండలి నిర్ణయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిబంధనలు సరిగా పాటించని 8 ఇంజినీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లను నిలుపుదల చేస్తూ అనంతపురం జెఎన్‌టియు బ్రేక్ వేసింది. యూనివర్శిటీ పరిధిలో తక్కిన 58 వాటికి అనుమతులిస్తూ పాలక మండలి సమావేశంలో నిర్ణయం చేసింది. వాస్తవానికి యూనివర్శిటీ పరిధిలో ఉన్నవి మొత్తం 75 కళాశాలలు. ఇందులో అంతకు మునుపే సరిగాలేవని రద్దుచేసినవి తొమ్మిది ఉన్నాయి. అవిపోను ఈ ఏడాది 66 కళాశాలల్లో ఫ్యాక్ట్స ఫైండింగ్ కమిటీ పరిశీలించింది. ఇందులోనూ ఎనిమిది కళాశాలల్లో సరైన ప్రమాణాల్లేవన్నది తేలింది. ఇందులో అనంతపురం జిల్లాలో రెండు, నెల్లూరులో రెండు, చిత్తూరులో ఒకటి, కడపలో ఒకటి, మదనపల్లి రెండు ఇంజనీరింగ్ కళాశాలలు ఫైండింగులో ఉన్నాయి. ఎటువంటి లోటుపాట్లు ఇక్కడున్నాయన్నది గుర్తించిన అంశాలను తెలియజేస్తూ పాలకమండలి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆయా కళాశాలలు ఇచ్చిన వివరణాల అనంతరం తదుపరి చర్యలు ఆధారపడి ఉండనున్నాయి.

కొత్త కోర్సులతో కలిపి 50 వేల వరకు సీట్లు

జెఎన్‌టియు యూనవర్శిటీ పరిధిలో ఉన్న 66 కళాశాలల్లో కలిపి గతేడాది మొత్తం 43 వేల సీట్లు ఉండేవి. ఈ ఏడాది యూనవర్శిటీలో కొత్త కంప్యూటర్ కోర్సులు పెంచడంతో అవి దాదాపు 50 వేల వరకు చేరాయి. ఇందులో ఇప్పుడు అడ్మిషన్లకు అనుమతులు రానివి వరకు చూస్తే సుమారు రెండు వేల పైచీలుకు సీట్లు రద్దయ్యే అవకాశం ఉంటుంది. సీట్లు ఉన్న కొన్ని కోర్సుల్లో అడ్మిషన్లు తక్కువగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో చాలా వరకు మిగిలిపోతూ వస్తున్నాయి. ఈ ఏడాది ఎన్ని సీట్లు భర్తీ అవుతాయన్నది చూడాల్సి ఉంది.

మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఇంజినీరింగ్ కళాశాలలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. జులై 1వ తేదీ నుంచే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమయ్యాయి. జులై 7వ తేదీతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియనుంది. జులై 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు హెల్ప్‌లైన్ సెంటర్‌లో అప్‌లోడేడ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది. జులై 8నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌లో కళాశాలల ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉంది. మార్పులు, చేర్పులుంటే జులై 13వ తేదీ వరకు అవకాశం ఉంటుంది. జులై 16వ తేదీన సీట్ల నిర్ధారణ పూర్తవుతుంది. జులై 17 నుంచి 22వ తేదీలోపు సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. జులై 19వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభమవుతాయి.

నిబంధనలు పాటించిన వాటికే అనుమతి

ఫ్యాక్ట్స ఫైండింగ్ కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనలు పాటిస్తున్న కళాశాలలకే అడ్మిషన్లకు అనుమతినివ్వాలని పాలకమండలి నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగానే కళాశాలలకు సీట్ల కేటాయింపులు జరిగాయి. ఈ ఏడాది ఎఐసిటిఇ కంప్యూటరు సైన్సులో కొత్త కోర్సులు చేపట్టింది. దీంతో అదనంగా ఏడు వేల సీట్లు కూడా పెరగనున్నాయి. అడ్మిషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఇప్పటికే ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. దానికి అనుగుణంగా యూనివర్శిటీ పరిధిలోనూ అడ్మిషన్లు మొదలయ్యాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పారదర్శకంగా కౌన్సిలింగ్ ప్రక్రియ జరిగే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ ,
జెఎన్‌టియు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్.

పరీక్షల నిర్వహణలో కేంద్రం విఫలం

విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

- నీట్ పరీక్షను రద్దు చేయాలి
- లీకులకు కారణమైన ఎన్టీఏ సంస్థపై చర్యలు తీసుకోవాలి
- 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్
- విజయవంతం చేయాలని ఐక్యవిద్యార్థి సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నీట్, నెట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీలు కేంద్రంలోని ఎన్టీఏ ప్రభుత్వం వైఫల్యం వల్లే జరిగాయని, నీట్ పరీక్ష ఫలితాల అక్రమాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీ గురువారం నిర్వహించనున్న దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుమల నరేష్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ఎఐఎస్‌ఎ నగర కార్యదర్శి బాలకృష్ణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, పిఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఆలాం, విఎస్‌ఐవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు భీమేష్ మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఎన్‌టిఎ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని, నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇది కాకుండా ఇటీవల విడుదలైన నెట్ పరీక్ష పేపర్ కూడా లీకేజీ అయ్యిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పరీక్ష పేపర్లు లీకేజీ అయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర విద్యా శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఈ విద్యా సంవత్సరం ఎన్టీఏ విడుదల చేసిన అన్ని పరీక్షా ఫలితాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎంతో కష్టపడి చదివిన వారు పేపర్ లీకేజీల కారణంగా వారి జీవితాలను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి నీట్ పరీక్షను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జూలై 4వ తేదీన జరిగే విద్యాసంస్థల బంద్‌లో విద్యార్థులు, మేధావులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, గిరి, భీమేష్, చందు, సూర్య, సోము తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ రాజీనామా

ప్రభావతమ్మ

ప్రజాశక్తి బ్రహ్మసముద్రం

బ్రహ్మసముద్రం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ ప్రభావతమ్మ ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆమె మంగళవారం తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన రాజీనామా నిర్ణయాన్ని తెలియజేశారు. తాను వైసిపిలో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. 2021 సెప్టెంబర్‌లో జెడ్పీటీసీగా ఎన్నిక అయ్యాయని చెప్పారు. వైసిపి ఐదేళ్ల అధికారంలో ఉన్నా తనను నమ్మిన ప్రజలకు మేలు చేయలేకపోయానని చెప్పారు. అందుకే పార్టీకి రాజీనామా చేశానని ఆమె తెలియజేశారు. 33 నెలల నుంచి నిధులు మంజూరు కాక గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోయానని చెప్పారు. దీంతో మనస్తాపం చెంది వైసిపికి రాజీనామా చేశాన్నారు. తన రాజీనామా లేఖను వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యకు పంపానన్నారు.

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో రెవెన్యూ లీగల్ అంశాలపై ఆర్డీవోలు, తహాశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. డివిజన్ వారీగా కోర్టు కేసుల పెండింగ్ ను జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులను రోజుకు ఒకటి చొప్పున వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక పద్ధతి ప్రకారం వీటిని పరిష్కరించడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవోలు, జి.వెంకటేష్ వి.శ్రీనివాసులురెడ్డి, రాణి సుస్మిత, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, తహాశీల్దార్‌లు పాల్గొన్నారు.

శెట్టూరు సచివాలయ 'వెల్ఫేర్' చేతివాటం

రూ.5.45 లక్షల పింఛను సొమ్ము స్వాహా

ప్రజాశక్తి-శెట్టూరు

శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో పని చేసే వెల్ఫేర్ చేతివాటం ప్రదర్శించారు. ఏకంగా పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును కాజేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా మల్లికార్జున పని చేస్తున్నాడు. ఈయన మంగళవారం నాడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించిన నగదును డ్రా చేసుకున్నాడు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో పింఛన్ దారులతో వేలిముద్రలు వేయించుకుని డబ్బులు మధ్యాహ్నం తరువాత ఇస్తానని చెప్పాడు. మధ్యాహ్నం అయినా అతను ఇవ్వకుండా తప్పించుకుని తిరిగాడు. బుధవారం ఉదయం తమ డబ్బును సచివాలయ వెల్ఫేర్ కాజేశాడని తెలుసుకున్న లబ్ధిదారులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న ఎంపిడిఒ ఇతర అధికారులు వెల్ఫేర్‌ను పిలిపించి మాట్లాడారు. పింఛన్ సొమ్ము వాడుకున్న వాస్తవమే అని అతను అంగీకరించాడు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పింఛన్లకు సంబంధించి మల్లికార్జున రూ.5.45 లక్షలు తన సొంతానికి వాడుకున్నట్లు అంగీకరించాడని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పింఛన్ దారులకు నష్టం జరగకుండా వారికి నగదు పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

ఎన్నికల ఖర్చుల వివరాలు అందజేయండి

ఎన్నికల వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు ఖర్చు వివరాలను బుధవారం సాయంత్రంలోపు అందజేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు తెలిపారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుల బృందంతో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే మాట్లాడుతూ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయ ఖర్చుకు సంబంధించిన తుది అకౌంట్స్ బుధవారం సాయంత్రం 5గంటలలోపు ఎన్నికల అంతిమ లెక్కలను డీఈవోకి అందించాలన్నారు. లేకుంటే డిస్క్ క్వాలిఫై అవుతారన్నారు. ఇప్పటివరకు సమర్పించిన వారి తుది అకౌంట్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుది అకౌంట్స్ సమర్పించని వారిని పిలిపించుకుని తుది అకౌంట్స్ సమర్పించాలని వారికి తెలియజేయాలన్నారు. కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం పోటీ చేసిన ప్రతి అభ్యర్థి వారి నామినేషన్ తేదీ నుంచి ఎన్నికల ఫలితాల తేదీ వరకు ఖర్చు చేసిన వివరాలకు సంబంధించిన నివేదిక, ఖర్చుల వివరాలు, బిల్లులు, ఓచర్లు, అఫిడవిట్స్, బ్యాంకు పుస్తకాలు, ఎబిసి రిజిస్టర్లు ఖచ్చితంగా సరిచూసుకుని అభ్యర్థి సంతకంతో అందించాలన్నారు. ఈ సమావేశంలో డిసిఒ అరుణకుమారి, టూరిజం ఆర్డీ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యయ పరిశీలన అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ అన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని పిటిసిలో వికసిత్ భారత్ స్పోర్ట్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఓ భాగం కావాలన్నారు. పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. క్రీడల ప్రోత్సాహానికి తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఒ హేమలత, టిడిపి జిల్లా కార్యదర్శి బుచ్చయ్యచౌదరి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి : డిఎంహెచ్ఒ

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో గ్రామస్తులు వాంతులు, విరేచనాల బారినపడ్డ విషయం పత్రికల్లో వచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన డిఎంహెచ్ఒ మంగళవారం నాగిరెడ్డిపల్లిని సందర్శించారు. ఇందులో భాగంగా వైద్య, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో ఉన్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం తాగునీటి ట్యాంకు, పైప్‌లైన్ లీకేజీ, కొళాయిల వద్ద అపరిశుభ్రతను పరిశీలించి తగు సూచనలు చేశారు. వీధుల్లో మురికి కాలువలు శుభ్రం చేయాలని, ట్యాంకును శుభ్రం చేసుకోవాలని కోరారు. కోరినేషన్ పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి కొల్లప్పను ఆదేశించారు. వాంతులు విరేచానాలు తగ్గుముఖం పట్టేదాకా గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ రవిశంకర్, ఎపిడమిక సెల్ కో ఆర్డినేటర్ వేమరెడ్డి, ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేంద్రప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ రామాంజనేయులు, ఎంఎల్‌హెచ్‌పి ప్రియాంక, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

సంతకాల సేకరణ

సంతకాల సేకరిస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

జిల్లాలోని కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు బాల రంగయ్య, రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ఉరవకొండలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డు అందాలంటే రైతు సంతకం నిబంధన తొలగించాలన్నారు. గ్రామసభల ద్వారా సిసిఆర్‌సి కార్డులు అందజేసి కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం, బీమా అందించడంతోపాటు ఆత్మహత్యల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేసి స్థానికంగా ఉన్న మార్కెట్లలో అమ్ముకునే సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని మిర్చి, పత్తిలాంటి వాణిజ్య పంటలు అమ్ముకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. హంద్రీనీవా, హెచ్ఎల్‌సి, జిబిసి ఆయకట్టు కింద ఉన్న పంట పొలాలకు సక్రమంగా నీరు అందించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల పూడికతీత చేపట్టి పిల్ల కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే దేవాలయ భూములు భూమిలేని పేదలకు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికే సంతకాలు సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు వెంకటేశు, మురళి, కౌలు రైతులు పాల్గొన్నారు.

సరికొత్త సంప్రదాయానికి కలెక్టర్ శ్రీకారం

ఉద్యోగుల సామూహిక విరమణ మహోత్సవం

ఉద్యోగ విరమణ పొందిన వారితో కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఉద్యోగి జీవితంలో చివరకు ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరి. ఇప్పటివరకు ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి వారి కార్యాలయాల్లోనే ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చేది. అలా కాకుండా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వినూత్నంగా ఆలోచించిన కలెక్టర్ వినోద్‌కుమార్ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా అన్నిశాఖల పరిధిలో ప్రతినెలా ఉద్యోగ విరమణ పొందుతున్న వారందరికీ కలెక్టరేట్‌లోనే శన్మాన కార్యక్రమం చేయాలని నిర్ణయించారు. అనుకున్న వెంటనే దాన్ని ఆచరణలో పెట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన 70 మంది జిల్లా అధికారుల నుంచి కిందిస్థాయి అటెండర్, సిబ్బంది వరకూ మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సామూహిక ఉద్యోగ విరమణోత్సవం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మా జీవితంలో చిరకాలం గుర్తుండిపోయే సందర్భం అంటూ, జిల్లా కలెక్టర్ నిర్ణయం స్ఫూర్తిదాయకం అంటూ చప్పట్లతో అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసులు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, హెచ్ఎల్‌సి ఎస్ఈ రాజశేఖర్, కలెక్టరేట్ ఏవో అంజన్‌బాబు, జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, శంకరయ్య, పీఆర్ ఎస్ఇ ఎర్రిస్వామి, తహశీల్దార్ నాగభూషణం, ఎంపిడిఓలు సుధాకర్‌బాబు, కమల్‌బాషా, ఏపీఆర్ఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కుళ్లాయప్ప, ఉద్యోగ విరమణ పొందిన వివిధ శాఖల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుమార్టం చేయకుండా వైద్యుల నిర్లక్ష్యం

ఆగ్రహించిన బంధువులు.. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా

ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతురాలి బంధువులు మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పాత గుంతకల్లులో నివాసం ఉంటున్న కృష్ణవేణి (26) కడుపునొప్పితో సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే మంగళవారం వరకూ పోస్టుమార్టం చేయలేదు. దీంతో వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట రోడ్డుపై ధర్నాకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న 2వ పట్టణ సీఐ గణేష్ సిబ్బందితో చేరుకుని ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఆసుపత్రిలో మృతదేహాన్ని ఉంచి 24 గంటలు గడచినా వైద్యులు పోస్టుమార్టం చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన సీఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డితో సంప్రదించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. దీంతో ఆందోళన విరమించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దాదాపు 16 రోజులు చేపట్టిన సమ్మె కారణంగా గత ప్రభుత్వం పలు హామీలను ఇచ్చిందన్నారు. కావున ఆయా హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

99.11 శాతం పింఛన్లు పంపిణీ

నార్పల : నార్పల మండలంలో మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 99.11 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపిడిఒ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రిన్సిపల్‌కు నగదు అందజేస్తున్న లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు రంజాన్

గుంతకల్లు : పట్టణంలోని బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో నివాసముంటూ కార్మెల్ జ్యోతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఓ విలేకరి సహకారంతో పేద విద్యార్థి చదువుకు లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు రంజాన్ మంగళవారం ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని కార్మెల్ జ్యోతి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి ఫీజు నిమిత్తం రూ.5,000 వేలను స్వయంగా ఆయనే పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్ పవిత్రకు అందజేశారు. ఈ సందర్భంగా రంజాన్ మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున విద్యార్థికి తమవంతు సాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గోల్డ్ రంజాన్, తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

వజ్రకరూరు మండలంలోని జరట్ల రాంపురం గ్రామంలో సర్పంచి తిరుపాలు యాదవ్ పర్యవేక్షణలో మంగళవారం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి రోగాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఫాగింగ్ చేస్తున్న కార్మికులు

పెండింగ్ 'ఉపాధి' వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-నార్పల

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ రాముడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 8 వారాల ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీ కూలీ కుటుంబ సభ్యులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, రాజకీయ జోక్యం ఆపాలని, 200 రోజులు పనులు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని, వంద రోజుల పనులు పూర్తి చేసిన కూలీలకు అదనంగా మరో వంద రోజులు ఉపాధి పనుల కల్పించాలని, వారం వారం వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలని, ఉపాధి హామీ మేట్లకు పారితోషికం చెల్లించాలని, పనిముట్లు, సమ్మర్ అలవెన్సు, అదనపు వేతనాలను కొనసాగించాలని, బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వై.ఎర్రినాగప్ప, షరీఫ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న 8 వారాల వేతనాలు చెల్లించాలని ఎపి వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు ఎపి వ్యకాసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, మండల అధ్యక్షులు టి.పెద్దయ్య, నాయకులు వెంకట్‌చౌదరి, నాగభూషణం, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ రమణ, ఎపిఒ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యకాసం మండల కార్యదర్శి సుంకన్న, రమణారెడ్డి, పుష్పరాజు, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎపి వ్యకాసం ఆధ్వర్యంలో వినతులు

నార్పల ఎంపిడిఒ నార్పలకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి వ్యకాసం నాయకులు

పెద్దపప్పూరు : జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్‌లో ఉన్న 8 వారాల వేతనాలను చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అమ్మలదిన్నె కుళ్లాయప్ప, కాశెట్టి నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం మండల నాయకులు నరసింహులు, ఓంశేఖర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వ్యకాసం ఆధ్వర్యంలో ఎంపిడిఒ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణనారాయణ, మండల అధ్యక్షులు ఆదినారాయణ, క్రిష్టిపాడు శాఖ కార్యదర్శి రంగస్వామి, కమిటీ సభ్యులు శివకృష్ణ, దాసరి వనూరుస్వామి, సంజీవుడు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

విద్యార్థి సంఘాల పిలుపు

గుత్తిలో సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న చేపట్టనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పేపర్ లీక్‌కు కారణమైన ఎన్‌డిఎ సంస్థను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, కృష్ణ, ఈశ్వర్, గురు, ధన, ఏఐఎస్ఎఫ్ నాయకులు రవితేజ, కిరణ్, మహేష్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : నీట్, యుజిసి నెట్ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ ఈనెల 4న ఎల్‌కెజి నుంచి పిజి వరకూ చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు హిరణ్య, ఏఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షులు అరుణ్, రషీద్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రేగాటి శివకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేకూరే వరకూ పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు నవీన్‌కుమార్, సురేష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : జులై 4న రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకుడు అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, గౌతమ్, వెంకీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, దాదాపీర్, వినయ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు జోసెఫ్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు

అనంతపురం కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా ఈనెల 4న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే సాయికుమార్, నగర అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు మంజునాథ్, మంజునాథ్, మురళీకృష్ణ తౌఫిక్, హర్ష, బాబా, ప్రభు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం అర్బన్ : జులై 4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నీటి పరీక్షలో నెలకొన్న అవకతవలపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, సాయి, మోహన్, వెంకీ, ఏఐఎస్ఎఫ్ తాలూకు ఉపాధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

కళ్యాణదుర్గం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో మండల పరిధిలోని బోరంపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మంగళవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు పేదల దరి చేరలేదన్నారు. మాజీ సీఎం జగన్ ఒంటెద్దు పోకడతో కార్యకర్తలు, నాయకులు సర్వనాశనం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బొబ్బ చర్మవ్యాధి టీకాలు

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా పశువులు, గేదెలకు బొబ్బ చర్మ వ్యాధి టీకాలను ఉచితంగా వేయనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ ఎ.రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 6 గంటలకు గంగవరం, బెలుగుప్ప గ్రామాల్లో ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దవడుగూరు ఎస్ఐగా చిన్నరెడ్డప్ప



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప

పెద్దవడుగూరు : మండల నూతన ఎస్ఐగా చిన్నరెడ్డప్ప మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు అనారోగ్య కారణాల వల్ల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు నూతన ఎస్ఐగా చిన్నరెడ్డప్పను ఇక్కడికి నియమించారు. అనంతరం మండలంలోని గ్రామాల పరిస్థితులు, సమస్యాత్మక గ్రామాలు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నేడు కలెక్టర్ రాక

కళ్యాణదుర్గం : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ బుధవారం హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే సురేంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసిపి నేత శ్రీనివాసులు గుండెపోటుతో మృతి

వజ్రకరూరు : మండలంలోని షేక్షానుపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గుర్రం శ్రీనివాసులు (46) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపి నరసింహులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని కడప రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కడప రోడ్డులోని ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జాకీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి అక్బర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో చోరీ

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న శ్రీ వాసవీ ఎలక్ట్రికల్స్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు దుకాణానికి ఉన్న షట్టర్ తాళాలు బద్దలకొట్టి లోనికి ప్రవేశించి రూ.10 వేలు నగదును దోచుకెళ్లారు. ఉదయాన్నే దుకాణానికి వచ్చిన యజమాని బొజ్జన్న చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుకాణాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ మలుపు వద్ద 67వ జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎంగిలిబండ గ్రామ మలుపు వద్ద పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని తాడిపత్రి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల్‌కు చెందిన డ్రైవర్ రసూల్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే స్థానికులు క్రేన్ సాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు క్షతగాత్రుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

పుట్లూరు : మండలంలోని అరకటివేముల గ్రామానికి చెందిన రవితేజపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... అరకటివేములకు చెందిన మైనర్‌ను అదే గ్రామానికి చెందిన రవితేజ, నాగేంద్ర బలవంతంగా మోటార్ సైకిల్‌లో తాడిపత్రికి తీసుకెళ్లారు. వీరిలో రవితేజ తాడిపత్రిలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఐచర్ బండిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

గుంతకల్లులో మొక్క నాటుతున్న కమిషనర్ వెంకటరమణయ్య, అధికారులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని గుత్తి రోడ్డులో రహదారికి ఇరువైపులా మున్సిపల్ అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలో పది వేలు మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో మున్సిపల్ సిబ్బందితోపాటు ఆయా ప్రాంతాల ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్పయాదవ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సత్తార్, టిపిఆర్ఓ మోహన్, ఆర్ఐ ఎర్రిస్వామి, ఎఇ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని ఒక్కొక్క మొక్క నాటాలన్నారు. వాతావరణ కాలుష్యం నుంచి కలిగే నష్టాలను నివారించడానికి మొక్కలు పెంపకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి గ్రామంలో నివాస గృహాల వద్ద కూడా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, లక్ష్మీరంగయ్య, వైవి.రంగారెడ్డి, వీరేష్, శివారెడ్డి, మోహినిద్దీన్ ఖాజాబీ, పాండురంగ, రవి, సిబ్బంది భారతీ, లీలావతి, గంగమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మొక్కలను నాటడంతోపాటు సంరక్షిద్దామని ఉపాధి హామీ పథకం ఎపిఒ అవినాష్, మాజీ జడ్పిటిసి వెంకటేశులు పిలుపునిచ్చారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడు కిలోమీటర్లు మేర గ్రామాల్లో 12 వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వన్నూరు స్వామి, రాము, గోపాల్, నాగేంద్ర, పద్మనాభ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీరంగపురం, ఎన్.గుండ్లపల్లి, నరసాపురం గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాజరు రికార్డులు, బయోమెట్రిక్ అటెండెన్స్‌లు, సర్వీసెస్ వివరాలను పరిశీలించారు. తర్వాత ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటలలోపు విధులకు హాజరు కావాలన్నారు. మండలంలో రోజూ 90శాతం సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి మాధవరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు శ్రీరాములు, అశోక్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు

రేపు ఉరవకొండలో వైసిపి ఆందోళన

వజ్రకరూరు : సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత ఉరవకొండలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై చేసిన దాడులు, దౌర్జన్యాలకు నిరసనగా ఈనెల 4న ఆందోళన చేయనున్నట్లు వైసిపి నాయకులు నరసింహులు, బసవరాజు, గోవిందు తెలిపారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని కవిత హోటల్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితర జిల్లా నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆరోగ్య అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఆశా డేను పురస్కరించుకుని మంగళవారం ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ నాగారంగయ్య అతిసారతో బాధపడే పిల్లల విషయంలో ఓఆర్ఎస్, జింక్ మాత్రల ప్రాధాన్యతపై వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ మాట్లాడుతూ జులైలో డెంగీ నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని పలు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే వజ్రకరూరు మండల కేంద్రంలోని స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ తేజస్వి ఆధ్వర్యంలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బందితో కలిసి డయేరియా నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిక్టేటర్ సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, సూపర్వైజర్లు నాగ శంకర్, సుశీలమ్మ, మరియు ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌ను ప్రజాఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జిల్లా ప్రజా ఆరోగ్య వేదిక, జిల్లా సెక్రటరీ పి.శ్రీనివాసరావు, అధ్యక్షులు డాక్టర్ కొండయ్య అధ్యక్షతన ప్రభుత్వ వైద్య కళాశాలలో శాలువా కప్పి సన్మానించారు. ముందుగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ఆరోగ్య హక్కు చట్టం ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ ప్రసూన, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జి.రాజమోహన్, ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కె.భానుకిరణ్, ఎపిఎంఎస్ఆర్‌యు జనరల్ సెక్రటరీ జి.మనోహర్, వైద్యులు నవీన్, శంషాద్‌బేగం, భీమసేనాచారి, నిహారిక, ప్రసాద్, వైద్య కళాశాల విద్యార్థులు, వైద్య ప్రతినిధులు, వెంకటేష్, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ కన్వీనర్, పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సీసీ జయరామప్ప, యుటిఎఫ్ జిలాన్, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్‌చంద్రబోస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ రన్నరప్ ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో స్పార్క్ చెస్ అకాడమీ కర్నూలు పట్టణంలోని అచల అప్పర్ ప్రైమరీ స్కూల్ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 రన్నరప్ టైటిల్‌ను అనంతపురం జిల్లా ఏ1 చెస్ అకాడమీ ప్రధాన శిక్షకుడు అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు సొంతం చేసుకున్నాడు. స్విస్ లీగ్ పద్ధతిలో ఆరురౌండ్లు నిర్వహించగా 5.5 పాయింట్లు సాధించి రన్నరప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే ఏ1 చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఓపెన్ విభాగంలో నాలుగవ స్థానం జొన్నగడ్డల నితీష్, 10వ స్థానం జి.శ్రీహ సాధించగా, అండర్-7 బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని షేక్ ఆసి అలీ, అండర్ 13 బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని కాశి నౌమిక సాధించారు. ఈ సందర్భంగా ఏ1 చెస్ అకాడమీ క్రీడాకారులను పలువురు ప్రముఖులు అభినందించారు.

రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఉదయ్‌కుమార్‌నాయుడు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ